కథ

# మల్లిన వయసులో త్రుళ్ళింతలు




పాలకోడేటి కృష్ణమూర్తి

ఉదయం ఏడున్నర దాటింది. అప్పుడే మార్నింగ్ వాక్‌కి వెళ్ళి వచ్చిన మూర్తి బెడ్‌రూంలో మంచంమీద వాలిపోయాడు.

"ఏవిటండీ అలావున్నారు. నీరసమొచ్చిందా?" అంది మూర్తి భార్య రాజ్యం కాఫీ కప్పు అందిస్తూ.

"మనసేం బాగోలేదు రాజ్యం" అన్నాడు మూర్తి కాఫీ కప్పు అందుకుంటూ.

"మళ్ళీ ఏమైందండీ. ఈ మధ్యనే కదా మార్నింగ్‌వాక్‌కి వెళ్ళినప్పుడు కుక్క వెంటబడి కరిచిందని ఇంజక్షన్ చేయించుకున్నారు. మరి ఈరోజు ఏమైంది?" చిరాగ్గా మొహం పెట్టి అడిగింది రాజ్యం.

"నీకు ఎలా చెప్పాలో తెలియడం లేదు డియర్" అన్నాడు మూర్తి లోపల సంతోషంగానే ఉన్నా పైకి విచారం కనబరుస్తూ.

"అదేంటి అలా అంటారు ఏం జరిగిందో చెప్పకుండా" అంటూ విసురుగా వంటింట్లోకి వెళ్ళిపోయింది రాజ్యం.

"మనసేం బాగోలేదు.. మనసేం బాగోలేదు..... మనసేం బాగోలేదు...." ఆగి ఆగి మూలుగులు వినబడ్డంతో ఒక్క ఉదుటున వంటింట్లోంచి బెడ్‌రూంలోకి పరుగెత్తుకొచ్చింది రాజ్యం.

"ఏమైందండీ. మీరు బాధతో మూల్గుతుంటే నేను పనులు ఎలా చేసుకునేది?" అడిగింది ఆదుర్దాగా రాజ్యం.

"ఏం చెప్పమంటావు? ఎలా చెప్పమంటావు? ఏమని చెప్పమంటావు? నా మనసులోని బాధ" అన్నాడు మూర్తి.

"అదేంటి. నోటితో చెప్పడం ఇష్టం లేకపోతే కాగితం మీద రాసి చూపించండి" అంది రాజ్యం.

"అది కాదు రాజ్యం. ఈ వయసులో ఆరోగ్యం కాపాడుకోవడం ముఖ్యం అని అన్నావు కదా !"

"అవును. అన్నాను."

"అందుకు ఆకుకూరలు, పచ్చి కూరలు తప్పనిసరిగా తినాలన్నావు కదా !"

"అవును"

"అంతేకాదు, మార్నింగ్‌వాక్ కూడా చేయాలి అన్నావా లేదా"

"అన్నాను. శరీర ఆరోగ్యాన్ని మెరుగుపర్చటంలో నడకను మించినది లేదు".

"నువ్వన్నట్టుగానే మార్నింగ్‌వాక్ కూడా మొదలుపెట్టాను కదా".

"అవును. నేను చూస్తూనే వున్నాను కదా. ఉదయం నిద్ర లేవగానే మార్నింగ్‌వాక్‌కి వెళుతున్నారు. మెదడులోకి చెడు ఆలోచనలు రాకుండా నడక కాపాడుతుంది."

"అక్కడ ఎంతమంది లేడీస్ అనుకున్నావ్ ! కొంతమందైతే సూపర్. వాళ్ళ అందం ముందు నీ అందం గుర్తుకురాగానే నా మనసు బాధతో మూలుగుతుంది. గుండెలు పిండేసినట్లయి అక్కడే వున్న ఓ బల్లమీద కొంచెం సేపు కూర్చుండిపోతాను" అన్నాడు మూర్తి విషాద వదనంతో.

ఒక్కసారి గతం కళ్ళముందు కదలాడింది రాజ్యానికి. అసలు ఈయన ఆయనేనా? పెళ్ళయిన తర్వాత పరాయి ఆడదాన్ని కనీసం కన్నెత్తి కూడా చూడని మనిషి, అంతేకాదు, కట్నకానుకలు ఇచ్చుకోలేరని తెలిసి కూడా తననే ఇష్టపడి పెళ్ళి చేసుకున్నారు. ఆయనేనా ఈయన. గతించిన కాలంనాటి మధురస్మృతులు తన మానసపటలం మీద కదలాడుతుండగా –

"ఉండండి. మన సందు చివర్లో ఉన్న సైకియాట్రిస్ట్‌ని పిల్చుకొస్తాను" అంది మాధుర్యం నిండిన స్వరంతో రాజ్యం.

"అంటే సైకియాట్రిస్ట్‌ని తీసుకొస్తే నా మనస్సులోని ఆందోళన తగ్గుముఖం పడుతుందా? చదువుకున్నదానివి. నువ్వు కూడా ఏంటి... డియర్."

"మీకు పిచ్చి ముదిరినట్టుంది. లేకపోతే మీ వయసేంటి? మీరేంటి? ఈ వయసులో అటువంటి నీచమైన కోరికలా. ఒకవైపు వెంట్రుకలన్నీ తెల్లబడుతున్నాయి. మూడు నాలుగేళ్ళలో రిటైర్ కాబోతున్నారు. అయినా కూడా అందమైన ఆడవాళ్ళని చూడగానే వాళ్ళముందు నేను అందవికారంగా కనపిస్తున్నాననుకోవడం మీ ఛండాలపు ఆలోచనలని సూచిస్తోంది. ఇద్దరు కొడుకుల పెళ్ళిళ్ళు చేశారు. వాళ్లు పెళ్లాం పిల్లలతో పరాయి వూర్లలో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. అప్పుడప్పుడు సెలవలకి వస్తూంటారు. వాళ్ళముందు కూడా అలాంటి ఇలాంటి వెర్రిమొర్రి వేషాలేస్తే మన పరువేం కావాలి. కాస్త కూడా ఇంగిత జ్ఞానం లేకపోతే ఎలా? మీరు అలా పడుకునుండండి. నేను సైకియాట్రిస్ట్‌ని వెంటబెట్టుకుని ఇప్పుడే వస్తాను" అంది రాజ్యం.



ప్రముఖ అంతర్జాతీయ మిమిక్రీ కళాకారుడు 'ధ్వనిబ్రహ్మ' ఆంధ్రకళారత్న చిట్టూరి గోపీచంద్‌కు వంశీ ఇంటర్నేషనల్ వారు ఉగాది పురస్కారంతో సత్కరించారు. హైదరాబాద్ త్యాగరాయగానసభ దైవజ్ఞశర్మ శాలువాతో సత్కరించగా, ప్రముఖ నటి శివపార్వతిగారు జ్ఞాపికనందించారు. వంశీరామరాజు అభినందనలు తెలిపారు.

"నా మీద ఎంత ప్రేమ డియర్ నీకు. నా మనసులోని బాధ ఇలా చెప్పానో లేదో అలా సైకియాట్రిస్ట్‌ని తీసుకు రావడానికి బయలుదేరుతున్నావు" అంటూ మంచంమీంచి లేచి టీవీ ఆన్‌చేసి మళ్ళీ మంచం మీద వాలిపోయాడు మూర్తి.

"నాకు తెలుసునండీ. పెరటిచెట్టు వైద్యానికి పనికిరాదని. ఇంట్లో అందమైన భార్య వున్నా సరే ప్రతి మగాడు పరాయి ఆడదంటే పడిఛస్తాడు" అంది రాజ్యం ఆందోళన మిళితమైన స్వరంతో.

"అది కాదు రాజ్యం, ఆ అమ్మాయి చాలా అందంగా వుంది. ఎందుకు నాకు దగ్గరవ్వాలనుకుంటోందో నాకు అర్థం కావడం లేదు డియర్...." అంటూ మూలిగాడు మూర్తి.

"ఏవండీ నిజం చెప్పండి. అసలు ఇలాంటి చెడు ఆలోచనలు ఎందుకొస్తున్నాయి. చెడు తిరుగుళ్ళు ఏమైనా అలవాటయ్యాయా" అందిరాజ్యం మూర్తి కళ్ళల్లోకి సూటిగా చూస్తూ.

"అటువంటిదేమీ లేదు డియర్. నన్నెందుకు అలా తీసిపారేస్తావు అసలు విషయం అర్థం చేసుకోకుండా " అన్నాడు మూర్తి కళ్లెగరేస్తూ.

"ఇందులో అర్థం కానిదేముంది. ఏ మగాడైనా తన భార్యముందు పరాయి ఆడదాన్ని మెచ్చుకోవడం ఏ భార్య సహించదు."

"ఎవరి గురించి నువ్వంటున్నది?"

"అదే మీ కలలరాణి గురించే."

"నా కలల రాణియా. ఎవరు?"

"అదేనండీ పక్కింటి రామనాథం గారి చెల్లెలు."

"రియల్లీ వండర్‌ఫుల్. నీ తెలివితేటలు అమోఘం డియర్. ఎలా కనిపెట్టావు?"

"అమ్మ పుట్టిల్లు మేనమామకు తెలియదన్నట్లు ఎంత అమాయకంగా మాట్లాడుతున్నారండీ మీరు. ఆ రోజు నాకు జ్ఞాపకం లేదనుకుంటున్నారా. అదేనండీ. ఆరోజు మీరు మార్నింగ్‌వాక్‌కి వెళ్ళినపుడు ఓ కుక్క మీ వెంటపడి మిమ్మల్ని గాయపర్చింది. ఆ రోజు మిమ్మల్ని పలకరించడానికి రామనాథంగారు ఆయన చెల్లెలు వచ్చారు. అప్పుడు మీరు ఆ అమ్మాయికేసి అదేపనిగా చూడ్డం నేను కనిపెట్టలేదనుకున్నారా? పైపెచ్చు ఆ అమ్మాయి మీకు అతి సమీపంగా వచ్చి "అంకుల్ మార్నింగ్‌వాక్‌కి ఒంటరిగా వెళ్ళకూడదు. కుక్కలు వెంటబడతాయి. అదే గనుక మనం కూడా ఓ కుక్కని వెంటబెట్టుకు వెళ్ళితే మనకి సేఫ్. ఎందుకంటే కుక్క మనిషిని తరమకుండా ఆ మనిషితో వుండే కుక్కని తరుముతుంది. అర్థమైందిగా ఈ లాజిక్. మీరు మటుకు ఏం చేస్తారులెండి. మీకు కుక్కలేదుగా. అందుకని

ఆరోజు అలా జరిగింది. నేను ప్రతిరోజు నాతోపాటు నా టామీని కూడా మార్నింగ్‌వాక్‌కి తీసుకెళ్తుంటాను. మీరు ఓ పని చెయ్యండి అంకుల్. రేపట్నుంచి మీరు కూడా నాతోపాటే వాకింగ్‌కి రండి అంకుల్. మీకే ప్రమాదమూ వుండదు"అంటూ అదేపనిగా కళ్ళు మిటకరించడం నేను గమనించలేదనుకున్నారా. వెంటనే మీరు ఏనుగెక్కినంత సంబరపడి నోట్లోంచి చొంగ కార్చుకున్నంత పనిచేసి మరునాటి వుదయం నుంచి ఆ అమ్మాయితో కలసి మార్నింగ్‌వాక్‌కి వెళ్ళడం చేయసాగారు"అంది రాజ్యం ఎంతో రీసెర్చి చేసినట్లుగా ఫోజు పెడుతూ.

"అవును రాజ్యం. ఆ అమ్మాయికి 27 లేక 28 సంవత్సరాల వయసుంటుంది. మన అబ్బాయి విజయ్ స్థానంలో అమ్మాయి గనక పుట్టి వుంటే దానికి అదే వయసుండేది. ఆ అమ్మాయి చాలా అందంగా వుంటుంది. మంచి అమ్మాయి. కానీ ఎందుకో ఏమో మరి రామనాథంగారు ఆ అమ్మాయికి పెళ్ళి చేయలేకపోయారు. ఎప్పుడు చూసినా 'దుష్ట జాతకురాలు' అని ఆడిపోసుకుంటుంటారు. ఆ అమ్మాయి తప్పేముంది? ఏం పాపం చేసిందని? పాపం తల్లితండ్రులు లేని పిల్ల. అప్పుడప్పుడూ కళ్లనీళ్ళపర్యంతమవుతూ వుంటుంది. నాకు మంచిగా అనిపించదు. అంతులేని జాలి కలుగుతుంది" అంటూ ఆ అమ్మాయి పట్ల సానుభూతిగా పలికాడు మూర్తి.

"మీ వరస చూస్తుంటే నన్నో పిచ్చిదాన్ని చేసి ఆడిద్దామనుకుంటున్నారేమో. ఆ పప్పులేవీ నా దగ్గర ఉడకవు. నేను ఎమ్.ఏ. సైకాలజీ చేశాను. నా దగ్గిరా మీ కుప్పిగంతులు" అంది సౌమ్యంగానే రాజ్యం.

"అసలు నువ్వనేదేంటి. పొరుగువారి పట్ల దయ జాలి కరుణలాంటివి వుండకూడదంటావా?" తర్కంగా అన్నాడు మూర్తి.

"మీ ధోరణి చూస్తుంటే నేనేమీ తెలియని అమాయకురాలిననుకుంటున్నట్టున్నారు. నాకు తెలియనిదంటూ ఏదీ లేదు. సాధారణంగా ఏభైఐదు సంవత్సరాలు దాటిందతర్వాత భార్యాభర్తల సంబంధంలో ఒక విధమైన అనిశ్చితి ఏర్పడుతుంది. ఆ సమయంలో 'వృద్ధాప్యయౌవన' కోరికలు కలగడం సహజం. అప్పుడు ఈ రకమైన వివాహేతర సంబంధాలు మనిషిలో ఓ కొత్త శక్తి, బలం పుంజుకునేట్టు చేస్తాయి. ఆ వయసులో ప్రతీ మగాడూ ఒక నవయౌవన ప్రేమని వ్యక్త పరుస్తాడు. కొందరు దాన్ని పొందుతారు. కొందరు కేవలం ఊహల్లో తమ తమ కోరికల్ని తీర్చుకుంటారు. మరికొందరు కథలు, చవకబారు ఉపన్యాసాల ద్వారా తృప్తిపడతారు. క్లుప్తంగా నేనేది ఏవిటంటే ప్రతీ మగాడూ ఏభై.... అరవై సంవత్సరాలు వచ్చినా తనకు తాను యువకుడిగానే భావిస్తాడు. చేష్టలు కూడా అలాగే వుంటాయి." అంటూ ఓ సుదీర్ఘోపన్యాసం ఇచ్చింది రాజ్యం.

"నువ్వు చెప్పేది వాస్తవమే రాజ్యం. నేను కాదనడం లేదు. ఇందులో నా తప్పేమీ లేదు. ఆ అమ్మాయే నా వెంట తిరగటానికి ఆసక్తి కనబరుస్తోంది. నిజం చెబితే నువ్వు నమ్మవు కాని ఈ విషయం నీకు తెలిస్తే ఇంకేమైనా వుందా అని నేను కంగారుపడని రోజంటూ లేదు. అంతేకాదు. మన పిల్లలమీద ఎటువంటి దుష్ప్రభావం పడుతుందోనని కలవరపడ్డాను కూడా. అటువంటి భయాలతో ఒక్కోసారి నేను తల పక్కకు తిప్పుకుని నడిచినప్పుడు "ఏంటి అంకుల్, ఈ రోజు నేను బాగాలేనా, స్మార్ట్‌గా కనబడ్డం లేదా. అలా తల తిప్పుకుంటున్నారు" అంటూ నన్ను రెచ్చగొట్టేది. దాంతో నా పురుషార్థాల పైన మరింత విశ్వాసం పెరిగేది. కొత్తలో అయితే ఒక్కోసారి నా ముందు మరోసారి నా వెనక నడిచేది. కాని రోజులు గడుస్తున్నకొద్దీ ఆ అమ్మాయే నాకు సామీప్యంగా వచ్చేసరికి నాకు సంతోషమేసి రోమాలు నిక్కబొడుచుకునేవి. ఆ అమ్మాయి నన్ను ఇష్టపడుతుందేమో నని ఖాళీ సమయంలో ఒకటే ఆలోచనలు చోటు చేసుకునేవి."అన్నాడుమూర్తి ఎంతో గంభీరంగా.

"అది సరే అలా వుంచండి. ఈ వయసులో అటువంటి తింగరిపనులు మీకు శోభ చేకూరుస్తాయా? ఎందుకు మన ఇంటావంటా లేని తింగరి చేష్టలు" అంటూ –

'బాలికతో మళ్ళీ పెళ్ళి. భార్య నలుగురు పిల్లలున్న వ్యక్తి నిర్వాకం'

"పెళ్ళి కాలేదని నమ్మించి యువతి మెడలో తాళి కట్టిన వ్యక్తి అరెస్ట్"

'25 సంవత్సరాల యువతిలో పరారైన 58 సంవత్సరాల వృద్ధునికి అరదండాలు"

"ఉసురు తీసిన వివాహేతర బంధం" – అంటూ వచ్చిన వివిధ పత్రికల క్లిప్పింగులు చూపించింది రాజ్యం.

వాటిని చూడ్డంతోటే ఖంగుతిన్నాడు మూర్తి.

"అరె అనవసర రాద్ధాంతం కాకపోతే ఈ క్లిప్పింగులేంటి? అదంతా పరిహాసం. కొంత వినోదంగా గడపడం కోసం నాకు నేను కుర్రాడిగా భావించుకుని కొంతసేపు నిశ్చింతగా వుండిపోతాను. ఆ తర్వాత మళ్లీ ఏ పని చేయడానికైనా నాకు ఓకొత్త ఊపు వస్తుంది. నాకు నా బాధ్యతలు తెలియనివి కావనుకోకు. జీవితం నీరసంగా, నీరవంగా గడవకుండా కొంత ఉత్తేజం పొందడానికే అటువంటివన్నీను" అంటూ సాంత్వనగా పలికాడు మూర్తి.

'ఓరి భగవంతుడా ! నా భర్తకి సద్బుద్ధిని ప్రసాదించు' అంటూ భగవంతుడిని వేడుకుంది రాజ్యం. అంతే. వెంటనే ఓ గొప్ప ఉపాయం తట్టింది రాజ్యానికి. దాన్ని అమలు పరుద్దామని నిర్ణయించుకుంది రాజ్యం.

ఆ రోజు ఆదివారం. ఉదయం ఐదున్నర అయింది. కాలింగ్‌బెల్ మోగడంతో తలుపు తీశాడు మూర్తి. ఎదురుగా రామనాథంగారు, ఆయన చెల్లెలు, తోక వూపుతూ టామీ.

రామనాథంగారిని చూసి ఆశ్చర్యపోయాడు మూర్తి. రామనాథం గారికి మార్నింగ్‌వాక్ అలవాటు లేదు. అటువంటిది ఆయన వచ్చాడేంటబ్బా అనుకుంటూ ఆలోచనలో పడ్డాడు మూర్తి. మూర్తి ఆలోచనలకి బ్రేక్ వేస్తూ – "అంకుల్ రెడీనా. పదండి వెళ్దాం" అంది రామనాథం గారి చెల్లెలు మూర్తివైపు చూస్తూ.

"ఒక్క నిమిషం, షర్టు వేసుకొస్తాను" అంటూ మూర్తి బెడ్‌రూంలోకి వెళ్లాడు. ఇంతలో వంటింట్లోంచి రాజ్యం బయటకొచ్చి –

"రామనాథంగారా. బాగున్నారా. మీకు మార్నింగ్‌వాక్ అలవాటు లేదుగా. నేను కూడా ఎప్పుడూ మార్నింగ్‌వాక్ చేయలేదు. ఇవాల్టినుంచి మనిద్దరం కూడా మార్నింగ్‌వాక్ చేద్దాం సరేనా" అంది ముసిముసిగా నవ్వుతూ. దాంతో రామనాథం గారు కొండెక్కినంతగా సంబరపడిపోతూ ఒళ్ళంతా గిలిగింతలు పెట్టినట్టుగా గింగిరాలు పోతూ –

"అలాగే మేడం. మీరు రమ్మంటుంటే నేను మాత్రం కాదనగలనా" అన్నారు మాటల్లో తిరకాసు జోడిస్తూ.

వాళ్ళ మాటలు మూర్తి చెవిన పడ్డాయి.

మూర్తి కంగారుగా హాల్లోకి వచ్చి –

"సారీ డియర్. ఇవాల్టి నుంచి మార్నింగ్ వాక్ బంద్. మనస్సును వ్యర్థ చింతన నుంచి తొలగించుకొని పవిత్ర చింతనతో నింపుకోవాలి. దానికి వ్యాయామం, మెడిటేషన్ ముఖ్యమైన మార్గాలు. మనం టీవీలో చూస్తూ వాటిని ప్రాక్టీస్ చేద్దాం. సమయమూ ఆదా అవుతుంది. ఆరోగ్యానికి ఆరోగ్యం కూడానూ" అన్నాడు మొహం ఆముదం తాగిన వాడిలా పెడ్తూ.

"మీరెంత మంచివారండీ. ఇంతలోనే ఎంత మార్పు" అంటూ ఆనందంతో మూర్తిని కౌగిలించుకుంది రాజ్యం. రామనాథంగారు ఆయన చెల్లెలు అక్కడే ఉన్నారన్న విషయం తెలిసి కూడా. అప్పటి వరకూ తోక ఊపుకుంటూ నిలబడ్డ టామీ ఎందుకో ఏమో తోక ఊపడం నిలిపేసింది.

"ఓ.కె. ఆల్ ది బెస్ట్" అంటూ రామనాథం గారు ఆయన చెల్లెలు అక్కడినించి నిష్క్రమించారు. మనసులోనే రామనాథం గారికి కృతజ్ఞతలు తెలుపుకుని ఒక్కసారి దీర్ఘనిట్టూర్పు విడిచి వంటింటి వైపు వెళ్లింది రాజ్యం మూర్తికి కాఫీ తయారు చేయడానికి.